


# రాధామోహనం

## – దేవరకొండ అన్నపూర్ణ



*ఇది ఒక అందమైన రాధామోహనగాథ. మనందరిలోను అంతర్లీనంగా ఉండి కాలప్రవాహంలో పడి మరిచిపోతున్న ప్రేమాభిమానాలనీ అనుభూతులని గుర్తు చేస్తూ, మనల్ని నవ్విస్తూ, అప్పుడప్పుడూ కళ్ళని చెమరుస్తూ, పనిలోపనిగా మరిచిపోతున్న విలువల్నీ మనుషులుగా మన బాధ్యతలనీ తట్టిలేపే కథామాలిక..!!*

8

## మనసున మనసుగ నిలిచిన కలవా

దూరంగా రాధ కార్ ని చూసి రెండు అడుగులు ముందుకు వేసి చెయ్యి ఊపాడు మోహన్. కార్ పార్క్ చేసి క్రిందకి దిగింది రాధ. ఇంతలేసి మేటల మధ్యలో ప్రవహించడానికి సిద్ధంగా ఉన్న వెల్లువలాంటి గోదావరిని ఆ అందమైన కళ్ళ వెనుక దాచిపెట్టి తన వైపు వస్తున్న రాధని చూసి, గుండెల్లో కలుక్కుమంది మోహన్ కి.

దగ్గరకి రాగానే అలవాటైన 'రాధ' వాసన గుండెల నిండా పీల్చుకుని, రాధ మొహాన్ని పరిశీలనగా చూసాడు. వారం రోజుల్లోనే చాలా చిక్కిపోయినట్లు అనిపించి, దగ్గరికి తీసుకోబోతూండగా ఫోన్ మ్రోగింది. వెంటనే రాధ వైపు చూసాడు మోహన్. రాధ కళ్ళల్లో నిరాశ. తిరిగి ఫోన్ వైపు చూసాడు. రుక్మిణి అని ఫోన్ లో కాలర్ ఐడీ కనబడింది. కాల్ కట్ చేసి – విల్ కాల్ యూ బేక్ అని మెసేజ్ పెట్టీ, ఫోన్ జేబు లో పెట్టుకున్నాడు మోహన్.

'మిస్డ్ యూ' అంటూ అల్లుకుపోయింది రాధ. సుతిమెత్తగా పొదివి పట్టుకుని కార్ దగ్గరికి తీసుకుని వచ్చి డోర్ తీసాడు మోహన్. రాధ కూర్చున్నాక డోర్ వేసి డ్రైవింగ్ సీట్ వైపు కదిలాడు.
కార్ ఫ్రీవే ఎక్కింది. "ఏమ్మా ఎలా ఉంది ఈ వీక్, పిల్లల్నీ నన్ను మిస్ అయ్యినట్లున్నావ్" అన్నాడు కాజువల్ గా

"అవును, వాళ్ళు బానే ఎడ్జస్ట్ అయినట్లున్నారుగా, మీరు కూడా తెగ తిరిగారు అక్కడ, నాతో మాట్లాడే టైం కూడా లేదు అయ్యవారికి" రాధ మాటల్లో నిష్ఠూరం, అంతకు మించిన పరిచయం లేని వ్యంగ్యం.

"ఎలా ఉంది, కెనడా.. మీ ఫ్రెండ్స్ ఎవరెవర్ని కలిసారు ఈసారి" అంది మోహన్ వైపు చూస్తూ.

కెనడా, రుక్మిణిని కలవడం అన్నీ మోహన్ స్మృతిపథం లో మెరిసాయి ఒక్కసారిగా.

--------------------

వారం రోజుల క్రితం.. శుక్రవారం మధ్యాహ్నం.

పిల్లల్లతో సహా కెనడా ఎడ్మంటన్ ఏర్పోర్ట్ లాంజ్ లో బావగారి కోసం వెయిట్ చేస్తున్నాడు మోహన్.

వెన్నుకి ఎవరిదో చూపు గుచ్చుకున్న భావన, టక్కున వెనక్కి తిరిగి చూసాడు. క్రీం కలర్ డ్రస్, హైహీల్స్, చేతిలో ఒక కారీ ఆన్ బేగ్ తో నిల్చొని తననే చూస్తోంది ఓ యువతి. తను వెనక్కి తిరిగి చూడగానే తడబడి అంతలోనే సర్దుకుని గ్లాసెస్ తీసింది.

"రుక్కు.... రుక్మిణి" మనసులో మాట పైకే అనేసాడు మోహన్.

ఒక్కసారిగా పాతికేళ్ళ జ్ఞాపకాలు తెరలు తెరలుగా కమ్ముకుంటూండగా షాక్లో ఉన్న మోహన్ దగ్గరికి నవ్వుతూ వచ్చింది రుక్మిణి.

"సో గుడ్ టు సీ యూ మోహన్" అంటూ.

"వావ్ నైస్, భలే గుర్తు పట్టావ్, ఎలా ఉన్నావ్ రుక్కు.. ఐ మీన్ రుక్మిణీ" అన్నాడు మోహన్ తడబడుతూ చెయ్యి ముందరికి చాస్తూ

చిన్నప్పటి నుంచి ఒకటే స్కూల్ ఒకటే కాలేజ్ అవ్వటం వల్లనో ఒకటే ప్రాణంగా ఉండటం వల్లనో వాళ్ల మధ్య ఉన్న చనువు, పాతికేళ్ళ దూరాన్ని తుడిపేసే వృధాప్రయత్నం చేస్తుంటే, షేక్ హేండ్ ఇవ్వాలా? లేక దగ్గరికి తీసుకోవాలా? స్నేహానికి హద్దులు నేర్పిస్తుందా వయసు? లేకపోతే ఇది ఇన్నేళ్ళ ఎడబాటు వల్ల వచ్చిన మొహమాటమా? ఏదీ తేల్చుకోలేని సందిగ్ధంలో ఉన్నాడు మోహన్.

చేయి అందుకుని దగ్గరికి వచ్చి – "ఏమైపోయావు ఇన్నాళ్ళు" అని ఆగింది రుక్మిణి.

రుక్మిణి కళ్ళల్లోని ఇంటెన్సిటీని చూసి చలించిపోయిన మోహన్ ఏదో అనబోతుండగా

"అడోరబుల్ కిడ్స్, హాయ్.. అయాం రుక్మిణి, మీ నాన్నగారు నేను చిన్నపుడు కలిసి చదువుకున్నాం" అని పిల్లల్ని పలకరించింది.

"హాయ్" అన్నారు పిల్లలు ఇద్దరూ.

"నేను ఎడ్మంటన్ వచ్చి నాలుగేళ్ళు అయింది, ఇక్కడే అటార్నీ గా పనిచేస్తున్నా, ఇవాళ పనిమీద విన్నీపెగ్ లో క్లయింట్ దగ్గరికి వెళ్ళి వస్తున్నా.. దూరం నుంచి నిన్ను చూసి నువ్వా కాదా అనుకుంటుంటే మీ అమ్మాయి కనిపించింది మోహన్.చిన్నప్పుడు నిన్ను చూసినట్టే ఉంది. అలా కన్ఫర్మ్ చేసుకున్నాను. నువ్వేంటి ఇక్కడ" అంది మోహన్ వైపు తిరిగి

వివరాలు, క్షేమ సమాచారాలు మాట్లాడుతుండగానే మోహన్ బావగారు కిరణ్ రావడం, మాటల్లో రుక్మిణి ఉండేది మోహన్ అక్క ఇంటికి దగ్గరలోనే అని తెలియడం, మోహన్ రుక్మిణి ఫోన్ నంబర్లు ఇచ్చి పుచ్చుకోవడంతో అక్కడినుంచి భారం గానే కదిలింది రుక్మిణి.

కార్లో ఇంటికి వెళ్తున్నంతసేపు మోహన్ ఆలోచనలు రుక్మిణి చుట్టూనే పరిభ్రమించడంతో కిరణ్ చెప్పినవేవీ సరిగ్గా వినకుండా 'ఊ' కొట్టడం గమనించి సైలెంట్ అయ్యారు కిరణ్ కూడా.

వాట్సాప్ డీపీ లో రుక్మిణి ఫొటో చెక్ చేసాడు. ఒక్కతే ఉన్న ఫొటో, అదే కాన్ఫిడెన్స్, అదే పొందిక, అదే చిరునవ్వు. ఫ్యామిలీ విషయాలు ఏమీ చెప్పలేదు అనుకుంటూ 'హాయ్' అని మెసేజ్ పెట్టాడు. డ్రైవింగ్ లో ఉండి ఉంటుంది అనుకుంటూ.

ఇంటికి వెళ్ళాక అక్కతో కబుర్లూ, భోజనాలు అయ్యి ఫోన్ చూసుకునే సరికి రుక్మిణి నుంచి ఆరు మెసేజ్ లు ఉన్నాయి. 'సాయంత్రం కలుద్దామా' అన్నది చివరి మెసేజ్. అలాగే అని రిప్లై పెట్టి లొకేషన్ షేర్ చేసాడు "పిక్ మీ అప్" అంటూ.

రాధ బిజీగా ఉండి ఉంటుంది అక్కడ మాంటిగామరీ లో అనుకుంటుండగా ఫోన్ – చూస్తే రుక్మిణి.
"ఫ్రీ గా ఉంటే పది నిముషాల్లో పిక్ చేస్కుంటాను" అంటూ.

లేచి చకచకా రెడీ అయ్యి, ఫ్రెండ్స్ ని కలిసి వస్తా అని అక్కకి చెప్పి బయటికి వచ్చాడు మోహన్.
నాలుగు అడుగులు వేసేసరికి బ్లాక్ లాంబో వచ్చి ఆగింది పక్కన. పాసెంజర్ సైడ్ విండో రోల్ డౌన్ అవ్వగానే రుక్మిణిని చూసి కనుబొమ్మలెగరేసి పాసెంజర్ డోర్ తీసుకుని లోపల కూర్చున్నాడు మోహన్.
సీట్ బెల్ట్ పెట్టుకుంటూ 'నైస్ కార్' అన్నాడు.
కార్ ముందుకు కదిలాక – ఇద్దరి మధ్యా ఒక్కసారిగా మౌనం..

మ్యూజిక్ ఆన్ చేసింది రుక్మిణి. లవ్ బర్డ్స్ లో **'మనసున మనసుగ నిలిచిన కలవా, పిలిచిన పలకగ ఎదటనే కలవా , దొరికినదే నా స్వర్గం, పరిచినదే విరిమార్గం , మిన్నుల్లో నీవే, మన్నుల్లో నీవే, కన్నుల్లో నీవే .....రా..వా..."** పాట మొదలయ్యింది.
సారంగ – రుక్మిణి కి ఇష్టమైన రాగం. ఏం మారలేదు తను అనుకుంటూ రుక్మిణి వైపు చూసాడు మోహన్. అదే సమయానికి రుక్మిణి కూడా చూడటంతో ఇద్దరూ నవ్వుకున్నారు.

"రాధ ఎలా ఉంది, ఎందుకు రాలేదు" అని అడిగింది రుక్మిణి. అవాక్కయ్యాడు మోహన్.

"నీకెలా.." అంటూ ఉండగా కార్ ఒక డ్రైవ్ వే మీదకి పుల్ చేసి పార్క్ చేసింది రుక్మిణి.

కార్ పార్క్ చేసి డోర్ దగ్గరికి వస్తూ " రా మోహన్, నా ప్రపంచానికి స్వాగతం" అంది.

చక్కగా కట్ చేసినా లాన్ మధ్యలో వాకింగ్ పాత్. అటూ ఇటూ గులాబీలు, ఇంగ్లీష్ డైసీలు తలలూపుతూ పలకరిస్తున్నట్లు ఆరోగ్యంగా నవ్వుతున్నాయ్.
"గార్డెనింగ్ చేస్తావా, అంత టైం ఉంటుందా"
"అవును, అది నా ఔట్లెట్"
"పర్లేదు చిన్నప్పటి అలవాట్లు ఏవీ వదలలేదు"

“అలవాట్లు ఏమిటి, ఏదీ వదలలేదు”
చివుక్కున తల తిప్పి చూసాడు, హాయిగా నవ్వింది రుక్మిణి.

డోర్ నంబర్ లాక్, కీ ఇన్ చేసి లోపలికి అడుగుపెట్టి, ‘రా’ అని చెయ్యి చూపించింది. విశాలమైన ఇల్లు. లివింగ్ రూంలోకి దారితీసి ‘కూర్చో మోహన్’ అని కిచెన్ లోకి వెళ్ళింది
లివింగ్ రూం లో గోడల మీద ఫోటోలు, నలుగురు పిల్లలు, ఇద్దరు మగ పిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు, పది సంవత్సరాలు నుంచి టీనేజ్ వరకు ఉంటారేమో. ఇక రుక్మిణి అమ్మ నాన్నల ఫోటోలు, తన అక్క, అన్నయ్య లతో డిస్నీ ట్రిప్ ఫొటోలు , నిల్చొని అన్నీ చూస్తూ తల తిప్పి చూసాడు మోహన్. చేతిలో మంచినీళ్ల గ్లాస్ పట్టుకుని తన వైపు చూస్తూ ఉంది రుక్మిణి.
‘ఓ.. వచ్చేసావా.. అడోరబుల్ కిడ్స్’ అని ఆగాడు మోహన్.
“ఫ్రైడే కదా ఇంకో గంటలో వచ్చేస్తారు సుధేష్ణ పెద్ద అమ్మాయి — హై స్కూల్ సీనియర్, రెండు అబ్బాయి ప్రద్యుమ్న – సోఫోమర్, మూడు అబ్బాయి –మోహన్ – ఎనిమిదో గ్రేడ్, నాలుగు అమ్మాయి — చారుమతి – ఆరో గ్రేడ్. రెండేళ్ల తేడా ఉండేలా అడాప్ట్ చేసుకున్నా” అని ఫొటోలు చూపిస్తూ ఆగింది.

తలతిప్పి ఆశ్చర్యంగా రుక్మిణి వైపు చూసాడు మోహన్.

“రామయ్య కాలేజ్ నుంచి నన్ను వెనక్కి తీసుకొచ్చేసాక అన్నయ్య బలవంతం మీద అమెరికా పంపించేసారు నాన్న. ఆ తర్వాత అక్కడే గ్రాడ్యుయేషన్ తర్వాత లా చేసాను. అన్నయ్య ఇంట్లో ఉండి ప్రాక్టీస్ మొదలు పెట్టాక పెళ్లి చేస్కోమని ఒత్తిడి చేసారు. నేను కాలేజ్ లో ఉండగానే ఇస్కాన్ లో చేరి సేవ మొదలుపెట్టాను, పైగా మన ఫ్రెండ్స్ ద్వారా నువ్వు కెనడా వచ్చావు అనీ, రాధ తో పెళ్లి కుదిరింది అనీ విన్నాను. పెళ్ళి చేసుకునే చాన్స్ లేదు అని చెప్పేసా. అన్నయ్య చాలా కాలం వెయిట్ చేసి చివరికి పెళ్లి చేసుకున్నాక నేను మయామీ మూవ్ అయిపోయి ఇండియా నుంచి రెండేళ్ళకి ఒకరు చొప్పున నలుగురు పిల్లల్ని దత్తత చేసుకున్నాను. ఆ తర్వాత నా జీవితగమనమే మారిపోయింది మోహన్. చాలా హేపీ గా ఉన్నాను. మధ్యలో నీ గురించి వాకబు చేస్తే నువ్వు అమెరికా లో సెటిల్ అయ్యావు అని చెప్పారు కానీ మన స్కూల్ మేట్స్ ఎవరూ నీ నంబర్ ఇవ్వలేకపోయారు. తర్వాత నేను ఇస్కాన్ ప్రోజెక్ట్ మీద కెనడా మూవ్ అయ్యాను. నాలుగేళ్ళ నుంచి ఇక్కడే ఉన్నాను. ఇవాళ అనుకోకుండా నిన్ను ఏర్పోర్ట్ లో చూసాను”

“ ఓహ్, గుడ్ టు హియర్, ఏమి చేస్తున్నావ్ ఇస్కాన్ ప్రోజెక్ట్, అసలు పెళ్లి చేసుకోను అనేంత పెద్ద నిర్ణయం ఎందుకు తీసుకున్నావ్ రుక్కు”

“నేను గ్రాడ్యుయేషన్ చదువుతున్న రోజుల్లో ఎక్కువ ఫ్రెండ్స్ ఉండేవారు కాదు మోహన్. అప్పుడు పరిచయమయ్యాడు శామ్. అప్పట్లో ఆఫ్రికన్ అమెరికన్లంటే వాళ్ళతో స్నేహం చెయ్యకూడదన్న అమాయకపు స్టీరియో టైపులో ఉండే నన్ను, తనంతట తానే పరిచయం చేసుకుని సాహిత్య ప్రపంచానికి, అమెరికన్ ఫుట్బాల్ కి పరిచయం చేసాడు. రోజుల తరబడి రాత్రి పగలు లేకుండా పుస్తకాల గురించి డిస్కస్ చేసేవాళ్ళం. తనకి హిందూయిజం మీద ఉన్న ఇంటరస్ట్ తో ఇస్కాన్ వైపు ఆకర్షితుడై నాతో పాటు ఇండియా వచ్చి ద్వారక విజిట్ చేసాడు కూడా. అలా నాకంటూ కొత్త ప్రపంచం తయారు చేసుకోగలిగేను. మొదట్లో మన గురించి, నేను మెడికల్ కాలేజ్ నుంచి వచ్చెయ్యడం గురించి చెబితే భారతదేశ

వివాహ వ్యవస్థ గురించి పేట్రియార్కల్ సమాజ వ్యవస్థ గురించి ప్రశ్నించిన శామ్, తొందరలోనే నన్ను ఆ బాధ నుంచి బయటికి తీసుకువచ్చాడు.

మా ఇద్దరి స్నేహాన్ని తప్పుగా అర్థం చేస్కున్న మా అన్నయ్య మళ్ళీ నాకు చెప్పబోయాడు. ఈ సారి గట్టిగా సమాధానం చెప్పాను. 'నా జీవితానికి సంబంధించిన అన్ని విషయాల్లో నిర్ణయాధికారం నాదే. నేను ఎవరితో స్నేహం చెయ్యాలో, నా హద్దులు ఏమిటో నేను నిర్ణయించుకోగలను' అని చెప్పాక మళ్ళీ నా జోలికి రాలేదు.

నాకూ శామ్ కీ ఉన్న స్నేహాన్ని మేమిద్దరమూ అలాగే ఉంచుకోవడం వల్ల ఒకరికి ఒకరం మంచి సపోర్ట్ సిస్టం గా మారాం కూడా. శామ్ తర్వాత కాలంలో కెనడా మూవ్ అయిపోవడంతో నేను ఒంటరి అయిపోయాను అనిపించింది, అప్పుడు శామ్ సలహా మేరకు పిల్లలని దత్తత తీసుకున్నాను. అది నేను తీసుకున్న నిర్ణయాల్లో అత్యుత్తమ నిర్ణయం అని ఖచ్చితంగా చెప్పగలను"

"కానీ నీకు తోడు?"

"నేను ఒంటరిగా ఉన్నాను అని ఎప్పుడూ అనిపించలేదు పిల్లలు నా జీవితం లోకి వచ్చాక. నాలుగేళ్ల క్రితం శామ్ ఇక్కడ ఇస్కాన్ ప్రోజెక్ట్ "గురుకుల్" మొదలు పెడుతున్నానని చెప్పాక, నేను కూడా ఇక్కడికి మూవ్ అయిపోయాను. శామ్, అతని భార్య, పిల్లలు ఇక్కడే దగ్గరలో ఉంటారు. నేను సంపూర్ణమైన జీవితం గడుపుతున్నాను మోహన్. నేను ఒంటరిగా ఉండిపోడానికి మాత్రం నువ్వు కారణం కానేకాదు. అలాంటి గిల్ట్ నీకు అక్కర్లేదు"

ఆశ్చర్యపోవడం మోహన్ వంతయింది. చిన్నప్పటి నుంచీ ఏ విషయంలో ఐనా నిశ్చితాభిప్రాయం ఉండేది రుక్కుకి. తనని బేలగా చూసిన ఒకే ఒక్క రోజు, బలవంతంగా కాలేజ్ నుంచి తీసుకువెళ్తున్నప్పుడు తను వెనక్కి తిరిగి మోహన్ వైపు చూసిన చూపు.  ఆ తర్వాత తనని అమెరికా పంపించివేసారని తప్ప మిగిలిన వివరాలు ఏవీ బయటికి రానివ్వలేదు తన తల్లితండ్రులు. చిన్నప్పటినుంచి తెలిసిన కుటుంబం కావడంతో వాళ్లంటే గౌరవాభిమానాలు ఉండటంతో మోహన్  బెస్ట్ ఫ్రెండ్ & ఫస్ట్ లవ్ దూరం అయిపోయిన బాధ తో సైలెంట్ అయ్యాడు తప్ప వాళ్లని ఏమీ అనలేకపోయాడు.

ఆ కాలం లోనే రమణ మహర్షి పుస్తకాలు, సంగీత సాహిత్యాలతో స్నేహం చెయ్యడం మొదలు పెట్టాడు మోహన్. ఆ తర్వాత కాలంలో మళ్ళీ రుక్మిణి లాంటి చలాకీ అమ్మాయి, కళ్లతో మాట్లాడే అమ్మాయి రాధ తన జీవితంలో తారసపడినా రుక్మిణి దూరమైన బాధ చాలా రోజులు వెన్నాడేది మోహన్ ని. అందువల్ల ఫైనల్ ఇయర్ దాకా రాధ తనకి దగ్గరవుతున్నా దూరం దూరం గా ఉండేవాడు కూడా. ఇన్నాళ్ళకి ఇన్నేళ్లకి మళ్ళీ రుక్మిణిని ఇలా కలుస్తాను అనుకోలేదు మోహన్.

మోహన్ ఆలోచనల్ని కట్ చేస్తూ ఫోన్ రింగ్ అయ్యింది.

ఎక్స్క్యూజ్ మీ అంటూ రుక్మిణి ఫోన్ ఎత్తి – "హేయ్ శామ్, వాసాప్" అని అటు వైపునుంచి అడిగిన ఏదో ఇన్ఫో ఇచ్చి, "డూ యూ నో హూ ఈజ్ హియర్. ఐ మెట్ మోహన్ ఇన్ ద ఏర్పోర్ట్ టుడే" అని విశేషాలు చెప్పింది.
"కుదిరితే ఒకసారి రా" అని చెప్పి ఫోన్ పెట్టేసింది.
రుక్మిణి కళ్లల్లో బాధ ఒక జీరలా కనిపించి మాయమవ్వడం గమనించాడు మోహన్.

"ఈజ్ ఎవ్రీథింగ్ ఒకే" అన్నాడు అప్రయత్నంగా.
"శామ్ భార్యకి ఎక్యూట్ లుకేమియా .. అదే... బ్లడ్ కాన్సర్. మేచింగ్ బోన్ మారో దొరకలేదు, శామ్, పిల్లలు చాలా డీలా పడిపోయారు. ఇప్పుడే కీమో నుంచి వస్తున్నాడు. పిల్లలు స్కూల్ నుంచి ఇక్కడికి వస్తారు అని చెప్పడానికి చేసాడు"

రుక్మిణి గొంతులో బాధ సుస్పష్టంగా వినిపించింది మోహన్ కి.
"నేను ఒకసారి చూడచ్చా రిపోర్ట్స్ , ఐయామ్ ఆన్ ఆంకాలజిస్ట్. మే బీ వి కెన్ ఫైండ్ ఎ వే. మా ఇన్స్టిట్యూట్లో చాలా రీసెర్చ్ జరుగుతోంది. ఆవిడ క్వాలిఫై ఐతే క్లినికల్ ట్రయల్ లో పెట్టవచ్చు" అన్నాడు.

"ఓహ్ తప్పకుండా. ఎన్నాళ్ళు ట్రిప్" అంది రుక్కు.
" ప్లాన్ ప్రకారం రేపు వెళ్ళిపోవాలి. కానీ ఉంటాను. ఐ వాంట్ టు సీ శామ్స్ వైఫ్."

మరునాడు తనతో పాటు ఎమ్.డీ చేసిన డాక్టర్ ఫ్రెండ్స్ దగ్గరికి వెళ్ళి, శామ్ వైఫ్ కేస్ షీట్ తెప్పించుకుని చూసాడు.
టికెట్ వారం రోజులు పుష్ చేసి, రుక్మిణిని తన ఫ్రెండ్స్ కి అందరికీ పరిచయం చేసి, అక్క కి బావగారికీ కూడా చెప్పి, వారం రోజులు తనతో పాటే తో ఉండి శామ్ వైఫ్ కేస్ ని తన ఫ్రెండ్ శివ కి ట్రాన్స్ఫర్ చేయించి, అన్నీ రిపోర్ట్స్ చూసి బయల్దేరాడు మోహన్.

రిటర్న్ వచ్చేటప్పుడు ఏర్పోర్ట్లో డ్రాప్ చేయడానికి తన పిల్లలతోసహా వచ్చింది రుక్మిణి. శ్రీనిధి, చిన్నూ తో పాటు తనకీ రాధకి కూడా గిఫ్ట్స్ ఇచ్చింది. వచ్చేముందు గట్టిగా హగ్ చేస్కుని " అయాం సో గ్లాడ్ టు సీ యు అగైన్, అండ్ ఇట్ మీన్స్ ఎ లాట్" అంది.

---

ఈ వారం రోజుల్లో రాధ తో మాట్లాడటం కూడా సరిగ్గా కుదరలేదు. రాధ అలుగుతుంది అనుకున్నాడు కానీ రాధ కళ్ళల్లో బాధ చూసి గుండెలో కలుక్కుమంది మోహన్ కి. కెనడాలో జరిగిందంతా వివరంగా చెప్పాడు కార్ డ్రైవ్లో.
కళ్ళల్లో నీళ్ళు నిండాయి రాధకి.

"సారీ" అంది నెమ్మదిగా
"ఎందుకమ్మా" అన్నాడు అనునయంగా
"ఏం లేదు" అని కార్ దిగి లోపలికి వచ్చింది. మనసంతా తేలికయిపోయినట్లనిపించింది రాధకి.

స్టౌటిపై ఆన్ చేసి వంటింట్లోకి వెళ్ళింది .

రాత్రి చదువుతూ మధ్యలో ఆపిన జేమ్స్ అలెన్ "ఆజ్ ఎ మాన్ థింకెత్" పుస్తకంలో మాటలు గుర్తు వచ్చాయి.

**'As he thinks, so he is; as he continues to think, so he remains'**

'మన ఉన్నతికి పతననానికి మనమే కారణం" అన్న విషయం గ్రహించాలి. మన వద్ద గల ఆలోచనల కర్మాగారంలో మనని అన్ని విధాలుగా సర్వనాశనం చేసే విధ్వంసకర ఆయుధాల్నీ తయారు చేసుకోవచ్చు లేదా సుఖసంతోషాలతోనూ శక్తి సామర్ధ్యాలతోనూ నిండిని మహోత్కృష్టమైన జీవితాన్ని నిర్ణయించవీలుగల ఉపయోగకరమైన పనిముట్లను కూడా తయారు చేసుకోవచ్చు. సక్రమమైన ఆరోగ్యకరమైన ఆలోచనల ద్వారా మనం భగవంతునితో సమానమైన పరిణతి సాధించగలం. తద్విరుద్ధంగా , నీచమైన ఆలోచనల ద్వారా, జంతువులకన్నా అధోగతికి దిగజారనూ గలము'

తన పరిస్థితులను సక్రమమైన ఆలోచనల ద్వారా సానుకూలంగా మలుచుకుని తృప్తిగా జీవిస్తున్న రుక్మిణి అంటే గౌరవం, అభిమానం రెట్టింపయ్యాయి రాధకి . నిజంగానే మోహన్ కి ట్విన్ లాంటిది కదా అనుకుంటుండగా

**"ఓడను జరిపే ముచ్చట గలరే వనితలారానేడు"** సారంగ రాగం మంద్రంగా స్పీకర్స్ లోనుంచి వస్తుంటే
"ఏమోయ్.. రుక్కుకి ఇష్టమన్నానని సారంగధరుడిని చేసేస్తున్నావా, అదేలే పాలీగామీ పర్లేదన్నావ్ గా" అంటూ వెనక నుంచి వచ్చి ప్రేమగా దగ్గరికి తీసుకున్నాడు మోహన్.

" మీకంత సీన్ లేదు గానీ మాస్టారూ" అంటూ భుజం పై తలవాల్చింది రాధ.
**"ఆడవారు యమున కాడ కృష్ణుని కూడి**
**ఆడుచు పాడుచునందరూజూడగ"** అని తను కూడా గొంతు కలుపుతూ

★★★★★★★★★★★★★★★

. *(వచ్చే నెల మరో మోహనం)*

Post your comments